ప్రజాశక్తి
బుధవారం 31 జనవరి 2024
5
అల్లూరి సీతారామరాజు



అంగన్వాడీ హెల్పర్ మృతి



పాంగి కాంతమ్మ(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - చింతపల్లి : మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ. పిసిరి మామిడి గ్రామానికి చెందిన అంగన్వాడీ హెల్పర్ పాంగి కాంతమ్మ (49) మంగళవారం మృతి చెందింది. కాంతమ్మ రక్తపోటు తగ్గిపోవడం మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అంగన్వాడీ హెల్పర్ కాంతమ్మ కుటుంబాన్ని ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు సాగిన చిరంజీవి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిసిరిమామిడి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం అంతక్రియలు నిర్వహించనున్నట్లు కాంతమ్మ కుటుంబ సభ్యులు తెలిపారు.

కొనసాగుతున్న డోలీ కష్టాలు!



కుమారిని డోలిలో మోసుకెళుతున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -అనంతగిరి : మన్యంలో గర్భిణులు, రోగులకు అత్యవసర వైద్యానికి డోలి కష్టాలు తప్పడం లేదు. అనంతగిరి మండలం మారుమూల గిరిజన గ్రామాలలో తరచూ ఇటువంటి ఘటనలే పునరావృతమౌతూ, మన్యవాసులు అష్టకష్టాలు పడుతున్నా పట్టించుకునే దిక్కు లేదని వాపోతున్నారు. కనీస రోడ్డు సౌకర్యాలు లేకపోవడం, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు మారుమూల గ్రామాలకు వెళ్లలేని పరిస్థితిలో రోగులను డోలి సాయంతో వైద్యం కోసం సమీప ఆసుపత్రులకు తీసుకెళ్లాలి. ఈలోగా అన్నీ సవ్యంగా సాగితే సరేసరి, లేకుంటే ప్రాణాలు పోయిన ఘటనలు అనేకం చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తాజాగా మంగళవారం ఉదయం పెద్దకొట పంచాయతీ సిదుగులపాడు గ్రామానికి చెందిన జన్ని, కుమారికి పురిటి నొప్పులు రావడంతో, దుప్పటితో డోలికట్టి, బండరాళ్లలో ఇరుకైన కొండ మార్గంలో రెండు కిలోమీటర్లు మోసుకొచ్చి, మెయిన్ రోడ్డుకు తరలించారు అక్కడనుండి వైద్యం కోసం అనకాపల్లి జిల్లా కె కోటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు ఈనెలలోనే 20వ తేదీన పిన్నకోట పంచాయతీ రాసకిలం గ్రామానికి చెందిన అనారోగ్య పీడితుడు సూకూరు బాబూరావు, ఈనెల 22న అదే గ్రామానికి చెందిన సూకూరు, చిన్నాలమ్మ అనే గర్భిణిని వారి కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం డోలీ మోతలతో ఆసుపత్రులకు తరలించారు. డోలిమోతతో ఆసుపత్రికి తరలించే క్రమంలో సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేని దుస్థితిలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ తరచూ చోటుచేసుకుంటున్నాయి రోగిని తీసుకెళ్లిన డోలిలోనే, కొందరి మృతదేహాలను తిరిగి గ్రామాలకు తీసుకు రావాల్సిన దౌర్భాగ్య పరిస్థితులను ఉంచి గట్టెక్కించాలని గిరిజనం కోరుతున్నారు.

జెసి కార్తీక్‌కు ఘన సన్మానం



జెసి కార్తీక్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, పిఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి -పాడేరు : ఉత్తమ సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందనిజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంచి సేవలు అందించిన జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను ఎప్పటికీ అందరికీ గుర్తుంటారని కొనియాడారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో బదిలీపై వెళ్తున్న జెసి కార్తీక్‌ను జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కలసి ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ జెసిగా అతి తక్కువ కాలం పనిచేసినప్పటికీ, అటు అధికారులలోను, ఇటు సిబ్బందిలోను మంచి పేరు తెచ్చుకున్నారని, ఎప్పుడు ఏ పని అప్పగించినా స్పోర్టివ్‌గా తీసుకుని పని పూర్తి చేసేవారన్నారు. ఎన్నో ఒడిదుడుకులు, ఒత్తిడులు మధ్య గిరిజన ప్రజలకు చేరువగా అందించిన సేవలు భవిష్యత్తులో వారికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ, కార్తీక్ చాలా చురుకైన వ్యక్తి అని, వెంటనే ఆకళింపు చేసుకోగలగటం ఆయనకి ప్రత్యేకమని కొనియాడారు. అదేవిధంగా అప్పగించిన పనిని పూర్తిచేసేవరకు వదలరని,జిల్లా పరిస్థితులు, స్థితిగతులు ఆనతి కాలంలోనే ఆకళింపు చేసుకొనే మేధావి అని కొనియాడారు.

సన్మాన గ్రహీత సంయుక్త కలెక్టర్ కె.కార్తిక్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒల సహకారంతో, వారి సూచనలు సలహాలతో పని చేయగలిగానన్నారు. పాడేరులో సామాజికంగా, భౌగోళికంగా ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉత్తమ అధికారుల సమక్షంలో ఒత్తిడికి గురి కాకుండా పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, డిఆర్ఒ వివి రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్లు పి అంబేద్కర్, పి మురళీకృష్ణ, వివిఎస్ శర్మ, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు కొండలరావు, డిఎల్ డిఒ శాంతలక్ష్మి, పాల్గొన్నారు.

అటవీ భూములకు పోడు పట్టాలివ్వాలి

అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు

సాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని వినతి



మాట్లాడుతున్న గంగరాజు

ప్రజాశక్తి- హుకుంపేట: లో సాగులో ఉన్న అటవీ పోడు భూములకు సాగుదారులైన గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో సిపిఎం మండల కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, పలు సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, పంటపొలాలకు సాగునీరు మళ్లింపునకు ఎత్తిపోతల పథకాలు , చెక్‌డ్యామ్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలో కొంతిలి, హుకుంపేట, తడిగిరి, అడ్డుమండ పంచాయతీ కేంద్రంలతోపాటు, బారమసి పంచాయతీ బారపల్లి గ్రామం, కొట్నాపల్లి పంచాయతీ మారేల, కొట్నాపల్లి గ్రామాలు, మట్టుజోరు పంచాయతీ నక్కలపుట్టు గ్రామం ఇలా ఎనిమిది పంచాయతీలో ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలతో సుమారు 52 గ్రామాలకు చెందిన దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరు అందేదని, వీటితోపాటు ఆరు చెక్‌డ్యామ్‌లతో మరో 2,500 ఎకరాల్లో పంటకు డోకా లేకుండా సాగునీరు అందేదన్నారు. అయితే లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు మూలన పడడం, చెక్‌డ్యామ్‌లు పాడవ్వంతో ఆయకట్టు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమైందన్నారు. బీడులుగా మారిన భూములన్నీ మళ్లీ సస్యశ్యామలం కావాలంటే ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించడంతోపాటు చెక్‌డ్యామ్‌లను పునర్నిర్మించాలని కోరారు. అటవీభూములకు సాగుపట్టాలు, వేలాదిఎకరాలుకు సాగునీటి సమస్యలపై జిల్లా కలెక్టర్ సుమీత్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పందించి, అవసరమైన నిధులను కేటాయించడం ద్వారా గిరిజనుల కష్టాలను తీర్చాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సిపిఎం ల్లా కమిటీ సభ్యులు సొంటేని హైమవతి. మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణరావు, పాంగి లింగమూర్తి, పడాల్ కృష్ణమూర్తి,, రామారావు. పాల్గొన్నారు

వెలుగు ఉద్యోగులపై సర్కారు శీతకన్ను!

- హామీల అమలును అటకెక్కించిన జగనన్న
- డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మెబాట
- చీమకుట్టినట్టయినా స్పందించని ప్రభుత్వం



నిరవధిక సమ్మె చేస్తున్న వైఎస్ఆర్ క్రాంతిపథం ఉద్యోగులు, సిబ్బంది

ప్రజాశక్తి- పాడేరు: 'మా డిమాండ్లు న్యాయమేగా... వెంటనే పరిష్కరించండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లాలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, వైయస్సార్ క్రాంతి పథం (వెలుగు) ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తున్నారు.. పాడేరు డివిజన్లోని 11 మండలాలలో పనిచేస్తున్న 140 మంది ఉద్యోగులు, రంపచోడవరం డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో పనిచేస్తున్న 84 మంది ఉద్యోగులంతా తమ విధులు బహిష్కరించి సమ్మెకు ఉపక్రమించారు. వివిధ కేడర్లలో పనిచేస్తున్న ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ, ఎల్ ఫోర్, సపోర్టింగ్ స్టాఫ్, ఎంఎస్, సిసిలు, ఇతర వెలుగు సిబ్బంది మూకుమ్మడిగా సమ్మెబాట పట్టారు. సమ్మెలో భాగంగా పాడేరు, రంపచోడవరం డివిజన్ కేంద్రాల్లోని ఐటిడిఎల ముందు మంగళవారం నుంచి నిరవధిక దీక్షలు చేపట్టారు. తమ సమస్యలపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ దీక్షా శిబిరంలో వెలుగు ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు.

23 ఏళ్లుగా వెలుగు సంస్థలో ఉద్యోగులుగా పనిచేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నామని వీరంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, న్యాయమైన డిమాండ్ల సాధనకు మూడేళ్లుగా ఎదురు చూపులే తప్ప, పరిష్కారం చేయడం లేదని, వెలుగు ఉద్యోగులు వాపోతున్నారు. డిఆర్‌డిఎను ప్రభుత్వసంస్థగా గుర్తించి,ఉద్యోగులకు క్యాడర్ ఫిక్స్ చేసి పేస్కేలు అమలు చేసి సర్వీసు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఫైనాన్స్ డిపార్ట్మెంట్ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పరిధిలో మంజూరైన పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన సర్క్యులర్ ఆదేశాలపై వెంటనే జిఒ ఇవ్వాలని, ఇపిఎఫ్ సీలింగ్ విధానం ఎత్తేసి, మూల వేతనంపై 100శాతం ఇపిఎఫ్‌ను అమలు చేయాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

ఇవీ ప్రధాన డిమాండ్లు

- సర్వీస్ క్రమబద్ధీకరణ
- నూరు శాతం బేసిక్‌పై ఇపిఎఫ్ చెల్లింపు
- ఎంఎస్‌సిసిలకు హెచ్ఆర్ పాలసీ అమలు
- ప్రభుత్వ సంస్థగా డిఆర్‌డిఎ గుర్తింపు
- ఉద్యోగులకు గ్రాట్యూటీ పెంపుదల
- కారుణ్య నియామకాలు చేపట్టాలి
- ఉద్యోగోన్నతులు కల్పించాలి
- 62ఏళ్లకు సర్వీసు పొడిగింపు

హామీలను అమలు చేయాలి



ప్రభుత్వ హామీ మేరకు కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీస్ క్రమబద్ధీకరించి, అర్హులకు ప్రమోషన్లు, రూ.16లక్షల గ్రాట్యూటీ చెల్లింపు, హెచ్ఆర్ఎ జిఒ అమలు, అన్ని కేడర్ల ఉద్యోగులకు ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లు ఇవ్వాలి.

జంపరంగి చిన్నారావు, జిల్లా అధ్యక్షులు, వైకెపి ఉద్యోగుల సంఘం, అల్లూరి జిల్లా.

పనిభారం పెరిగింది..



వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వైకెపి ఉద్యోగులపై పనిభారం పెరిగింది. ఒత్తిడిని అధిగమించి శక్తి వంచన లేకుండా పనిచేస్తున్నాం. సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేసి న్యాయం చేయాలి

ఆర్ సుందరి, డివిజన్ ఉపాధ్యక్షురాలు వైకెపి ఉద్యోగుల సంఘం

ఉద్యోగులంతా దగా పడుతున్నాం



ఏళ్ల తరబడి అపరిష్కృత సమస్యలతో వెలుగు ఉద్యోగులంతా దగా పడుతున్నాం. మూడేళ్లుగా పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తాం

పి మధుబాబు, ఉపాధ్యక్షులు, వైకెపి ఉద్యోగుల సంఘం, అల్లూరి జిల్లా.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా...



సమస్యలను ఇప్పటికే ఎన్నోసార్లు ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగాం. వైకెపిలో అన్ని కేడర్లలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీని సిఎం జగన్ నిలబెట్టుకోవాలి.

నారాయణరావు, డివిజన్ సెక్రటరీ సెర్ప్ ఉద్యోగుల సంఘం

ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

- పరిమితికి మించి ప్రయాణికులతో నడుస్తున్న వాహనాలు
- బస్సుల్లేక వలస కూలీలకు తప్పని పరిస్థితి



వాహనంలో వేలాడి వెళ్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి చింతూరు

బతుకుతెరువు కోసం సుదూర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లి తిరిగి సొంత గూటికి చేరే క్రమంలో ఆటో అంచుల్లో నిలబడి ప్రమాదక స్థితిలో ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రాలు ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్ నుండి వలస కూలీలు హైదరాబాదు తదితర పట్టణాలకు వందల సంఖ్యలో వెళ్లి వస్తుంటారు. హైదరాబాదు నుండి భద్రాచలం వరకు బస్సుల్లో వస్తున్నారు. అక్కడి నుండి ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్‌లోని తమ ప్రాంతాలకు వెళ్లేందుకు అవసరమైన మేరకు బస్సుల్లేకపోవడం, ఉన్నవి సమయానికి లేకపోవడంతో వలస కూలీలు అధికంగా ఆటోలను, టాటా మ్యాజిక్ వ్యాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు వాహనదారులు సామర్థ్యానికి మించి ప్రమాద స్థాయిలో ప్రయాణికులను ఎక్కించుకొని జాతీయ రహదారి-30 మార్గంలో తమ వాహనాలను పరుగులు పట్టిస్తున్నారు. ఈ క్రమంలోనే అదుపుతప్పి వాహనాలు ప్రమాదానికి గురై నిండు ప్రాణాలు పోతున్నాయి. ఆటో అంచుల్లో నిలబడి ప్రయాణం చేయడం ప్రమాదమని తెలిసినా గమ్యం చేరడమే లక్ష్యంగా తప్పని పరిస్థితుల్లో వలస కూలీలు ప్రయాణిస్తున్నారు. వేగం కంటే ప్రాణం మిన్న అన్ని నినాదాలు బోర్డులపైనే కనిపిస్తున్నాయి తప్ప ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదు. గంట ఆలస్యమైనా ఆర్టీసీ బస్సు ప్రయాణం చేయాలని, సురక్షితంగా గమ్యం చేరాలని ఎప్పటికప్పుడు రవాణా శాఖ, పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రయాణికులు పట్టించుకోవడం లేదు. అధికారులు కొంత చొరవ చూపి ప్రైవేటు వాహనాల దూకుడును తగ్గించి సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటే కొంతవరకైనా మార్పు వస్తుందని పలువురు భావిస్తున్నారు. అలాగే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడిపితే ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన అవసరం ఉందని పలువురు ప్రయాణికులు అంటున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత కుంట



విజేత కుంట జట్టుతో ఎపి జెన్‌కో అధికారులు, నిర్వాహకులు

ప్రజాశక్తి- మోతుగూడెం

చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో మోతుగూడెం క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కుంట జట్టు నిలిచింది. ఫైనల్‌లో మోతుగూడెం జట్టుతో తలపడి కుంట జట్టు విజయం సాధించింది. మొదట టాస్ గెలిచిన కుంట జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన మోతుగూడెం జట్టు 16 ఓవర్లలో 133 పరుగులు చేసింది. 134 పరుగుల టార్గెట్‌గా బ్యాటింగ్‌కు దిగిన కుంట జట్టు లక్ష్యాన్ని చేధించింది. కుంట కెప్టెన్ రవి మంచి ప్రతిభ కనబర్చారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.30వేలు ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజనీర్ బొడ్డేటి శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. రన్నర్‌గా నలిచిన మోడుగూడెం జట్టకు డిఈ ఓ ఎమ్ బాలకృష్ణ చేతులు మీదగా రూ.15000 బహుమతి ఇచ్చారు. టోర్నమెంట్‌కి విచ్చేసిన వారికి మోతుగూడెం క్రికెట్ క్లబ్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

త్వరలో టాటా సంస్థలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ప్రేరణ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతికి టాటా టెక్నాలజీ సంస్థలో ఉద్యోగాల నిమిత్తం త్వరలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు సీలేరు ఎస్ఐ రామకృష్ణ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, 18 నుంచి 24 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న మహిళా అభ్యర్థులు దీనికి అర్హులని పేర్కొన్నారు. ఎంపికైనవారికి కర్ణాటకలోని మైసూర్ సిటీలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. నెలకు రూ.20 వేలు నుంచి ప్రారంభమవుతుందని, నిరుద్యోగ మహిళా యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలవారు సీలేరు పోలీస్ స్టేషన్లోగాని, సచివాలయ మహిళా పోలీసులకు తమ వివరాలు అందజేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, చిత్రంలో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఎన్నికల కమిషన్ నిబంధనలు పక్కాగా పాటించాలి

- రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్ నిబంధనలను ప్రొసీడింగ్ అధికారులు పక్కాగా పాటించాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాలులో రంపచోడవరం నియోజకవర్గం నోడల్ అధికారులు, సెక్టార్ల అధికారులు, తహశీల్దార్లతో సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పిఒ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అన్ని పోలింగ్ స్టేషన్లలో రన్నింగ్ వాటర్, కరెంట్ వంటి మౌలిక సదుపాయాలు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ప్రతి సెక్టార్‌కు సంబంధించిన మ్యాప్‌లు తయారు చేసి సమర్పించాలని, ఎన్నికల నిర్వహణకు ఏ వాహనాలు కావాలో ప్రతిపాదన తయారు చేసి ఇవ్వాలని సూచించారు. రంపచోడవరం నియోజకవర్గంలో మొత్తం 399 పోలింగ్ బూత్లకు 59 మంది సెక్టార్ల అధికారులను, 18 మంది నోడల్ అధికారులను నియమించినట్లు చెప్పారు. వీరికి ఎన్నికల విధులపై త్వరలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పోలింగ్ బూతుల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫోటోలు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉంటే తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు యన్‌వివి సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు టి.లక్ష్మణ్, ఇందిరా బాయ్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో తరాబు జలపాతాల వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

పర్యాటకుల సందడి

- తరాబు జలపాతానికి క్యూ

ప్రజాశక్తి -సీలేరు

జీకే మండలం సీలేరు ప్రాంతంలో మంగళవారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు రావడంతో సందడి నెలకొంది. మెయిన్ డ్యామ్‌పై మంచు అందాలు, పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు, రిజర్వాయర్లు తిలకించి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలను తిలకించడానికి పర్యాటకులు క్యూ కడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చి బాలాజీ, శ్రీనివాస లాడ్జిలలో విడిది చేసి ఈ ప్రాంతంలో సహజ సిద్ధమైన అందాలను, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు చిత్రకొండలో బలిమెల రిజర్వాయర్, చిల్డ్రన్ పార్క్ వంటివి తిలకించడంతో పాటు బోట్ షికార్ చేసి ఎంతో అనుభూతిని పొందుతున్నారు. ఎత్తయిన కొండపై నుండి గలగల పారే తరాబు జలపాతం పర్యాటకులను అబ్బురపర్చుతుంది. అయితే తరాబు జలపాతానికి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేక అనేక ఇబ్బందులు గురవుతున్నారు. గుట్టలు రాళ్ల దాటుకుంటూ పర్యాటకులు వెళ్ళవలసి వస్తుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే పర్యాటికుల తాకిడి మరింత పెరుగుతుందని పలువురు భావిస్తున్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు పర్యాటకంగా మరింత అభివద్ధి చెందాలంటే పర్యాటకశాఖ ప్రత్యేక దృష్టి సారించి జలపాతాలకు రహదారి సౌకర్యం, పర్యాటకులు సేదతీరడానికి విశ్రాంతి భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కొండజర్తలో వైద్య సేవలు

ప్రజాశక్తి -సీలేరు

జీకే.వీధి మండలం గుమ్మరేవుల పంచాయతీ కొండజర్త గ్రామంలో మంగళవారం ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమబిందు ఇంటింటికి వెళ్లి గిరిజనులకు వైద్య సేవలు అందించారు. డాక్టర్ హిమబిందు బృందం కొండలు, గుట్టలు, వాగులు దాటుకుంటూ ఐదు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి గ్రామంలో 40 రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నైన పెంటయ్య తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో వారి ఇంటికి వైద్యాధికారి వెళ్లి వైద్య పరీక్షలు చేసి రక్తహీనత, గొంతులో కాయలు ఉన్నట్లు గుర్తించారు. ఆయన్ని దారకొండ పిహెచ్సికి తరలించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారి బంధువులు సహాయంతో డోలిమేతతో దారకొండ పీహెచ్సీకి తరలించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ఎవరో ఆందోళన చెందవలసిన అవసరం లేదని సూచించారు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే పిహెచ్‌సికి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఇంటి దగ్గరకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ హిమబిందు



మాట్లాడుతున్న ఐద్వా నేత జయ

నీటి సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యం : ఐద్వా

ప్రజాశక్తి- అరకులోయ : పర్యాటక కేంద్రమైన పెదలబుడు పంచాయతీ అరకులోయలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఐద్వా రాష్ట్రకమిటీ సభ్యులు వివి.జయ డిమాండ్ చేశారు. స్థానిక ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, వారం రోజులుగా అరకులోయలోని వీధి కుళాయిల్లో నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిలు మరమ్మతులు చేసి నీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా స్పందించే నాధుడు కరువయ్యారని వాపోయారు. మరమ్మతులకు గురైన కుళాయ కనెక్షన్లను పంచాయతీ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం లేదన్నారు. టౌన్ షిప్ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అరకులోయ, పెద్దల బుడు పంచాయతీ గ్రామంల్లోని కుళాయిలన్నీ మరమ్మతులు చేయాలన్నారు. తాగునీటి సమస్యపై స్పందించకుంటే ఖాళీ బిందెలతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన మహిళా సంఘం మండల సెక్రెటరీ కె.శశికళ, కమిటీ సభ్యులు సన్యాసమ్మ, సుమిత్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

కోర్టు తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు టౌన్: టిడిపి అధినేత చంద్రబాబుపై నమోదు చేసిన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఎపి ప్రభుత్వానికి చెంప పెట్టని మాజీ ఎమ్మెల్యే, పాడేరు నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. వైసిపి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, టిడిపి-జనసేన ప్రభుత్వం రానుందన్నారు. మంగళవారం పాడేరు కుమ్మరిపుట్టులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మరో మూడు నెలల్లో రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొంది, టిడిపి-జనసేన నేతృత్వంలో ఉమ్మడి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వైసిపి అరాచకాలను ప్రజలకు వివరించి, జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని టిడిపిజనసేన కార్యకర్తలకు- పిలుపునిచ్చారు. వైసిపిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రాష్ట్రంలో ప్రజలందరూ విసిగి పోయారని, ఇక జగన్‌ను ఇంటికి సాగనపండానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రంపచోడవరం : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మీద పెట్టిన కేసుల్లో ఒకటైన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ రద్దు చెయ్యాలని ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టు వేయడం జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు అని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా జగన్ అర్థం చేసుకొని తన వైఖరి మార్చుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షుడు కారం సురేష్, ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంత మోహన్, తెలుగు యువత అధ్యక్షులు సిద్ద వెంకన్న దొర, పండా కృష్ణమూర్తి, కొమరం బాబీ, లంక హరిబాబు, సీనియర్ నాయకులు ధార వెంకన్న పాల్గొన్నారు.

దుర్గంధభరితం!

- అధ్వానంగా ఐటిడిఎ షాపింగ్ కాంప్లెక్స్
- పార్కింగ్ స్థలంలో మలవిసర్జనతో ఇబ్బందులు
- పట్టించుకోని గ్రామ పంచాయతీ, అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ గిరిజన మ్యూజియం పక్కన నిర్మించిన ఐటిడిఎ షాపింగ్‌కాంప్లెక్స్‌లో పార్కింగ్ స్థలంలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నా పంచాయితీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని


షాపింగ్ కాంప్లెక్స్ వద్ద చెత్తాచెదారం


బహిరంగ మల విసర్జనతో కంపు కొడుతున్న పార్కింగ్ స్థలం

స్థానికులు మండి పడుతున్నారు. పంచాయతీకి ఆదాయం వస్తే చాలు షాపింగ్ కాంప్లెక్స్ పార్కింగ్ స్థలం ఎలా ఉన్నా పర్వాలేదనే రీతిలో పంచాయతీ అధికారులు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. నిత్యం దేశ, విదేశీ పర్యాటకులతో సందడిగా ఉండే అరకులోయలో పార్కింగ్ స్థలంలో ఇంతలా దుర్గంధభరితంగా ఉండడడం సరికాదని, వాహనాల పార్కింగ్‌కు వెళ్లివచ్చేటప్పుడు ముక్కు మూసుకుని, అపారిశుధ్యంలో వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. చెత్తచెదారం తొలగించకపోవడంతో దుర్వాసన వస్తుందని దుకాణాదారులు చెపుతున్నారని, దీని వల్ల షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల వద్దకు కొనుగోలుదారులు రావడం లేదని, తద్వారా తమ వ్యాపారాలకు దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే పంచాయితీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు పర్యాటకులు, దుకాణాలు డిమాండ్ చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు

ప్రణాళికలు సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి -పాడేరు: పోలింగ్ కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేసారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో అరకు నియోజకవర్గం సెక్టార్ అధికారులతోఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల సామగ్రి తరలింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అరకు నియోజకవర్గం పరిధిలో 54 సెక్టార్లలో 304 పోలింగ్ కేంద్రాలున్నాయని, పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, రవాణా సదుపాయాలు, అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థలపై సెక్టార్ అధికారులకు అవగాహన ఉండాలన్నారు. ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పోలింగ్ సిబ్బందిని తరలించడానికి ఎన్ని బస్సులు, జీపులు కావాలో అధికారులను అడిగి నమోదు చేసుకున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఆరా తీసారు. సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలు, గ్రామాలను సందర్శించినదీ? లేనిదీ సర్పంచ్‌లను అడిగి తెలుసు కున్నారు. అరకు తాహశీల్దార్ కేంద్రం నుంచి ఏయే పోలింగ్ కేంద్రం ఎంత దూరంలో ఉంది? ప్రయాణసమయంల, ఇతర వివరాలను సెక్టార్ అధికారులను అడిగి తెలుసు కున్నారు. పోలింగ్ కేంద్రాలకు నేరుగా చేరుకోవాలని, మధ్యలో ఎక్కడా వాహనాలు ఆగకూడదన్నారు.

ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ బస్సులలో ఎన్నికల


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

సిబ్బంది ప్రయాణించడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బస్సులు వెళ్లని గ్రామాలకు జీపులను కేటాయిస్తామన్నారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపడతామన్నారు. సెక్టార్ అధికారులు మరొక సారి పోలింగ్ కేంద్రాలను సందర్శించాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌ఒ వివి.రమణ, ఎస్‌డిసి పి. అంబేద్కర్, అరకు నియోజకవర్గంలోని ఐదు మండలాల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

గురుకులంలో సిసి కెమెరాల ఏర్పాటు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు 22 సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రతి తరగతి గదితోపాటు, పాఠశాల ఆవరణ, వంటగది, స్టాఫ్‌రూములో ఒక్కొక్కటి, స్టోర్‌రూమ్‌లో రెండు సిసి కెమెరాలను అమర్చారు. సిసి కెమెరాలు అమర్చడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అనుక్షణం ఉన్నతాధికారుల పర్యవేక్షణలో ఉంటారని, తరగతి గదుల్లో విద్యార్థుల ప్రవర్తన, ఉపాధ్యాయుల చర్యలు అన్నీ సిసి కెమెరాల నిఘాలో పర్యవేక్షణకు వీలుంటుందన్నారు. అంతేకాక పాఠశాల, వసతిగృహంలో బయట వ్యక్తులు ప్రవేశం, వారి చర్యలు ఇతరత్రా సిసి కెమెరాల నిఘాతో పర్యవేక్షించే వలు ఉంటేలా వీటిని ఏర్పాటు చేశారు. వంద మీటర్ల దూరం వరకు జరుగుతున్న అన్ని చర్యలను నాణ్యతతో రికార్డు చేసే అధునాతన టెక్నాలజీతో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా గురుకులంలో అణువణువూ పర్యవేక్షణకు ఆస్కారముంటుందని భావిస్తున్నారు.


చింతపల్లిలో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపిపి అనూషాదేవి తదితరులు

మహాత్మునికి ఘన నివాళి

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పాడేరు పట్టణంలోని శ్రీ అక్షర పబ్లిక్ స్కూల్, మోదమాంబ స్కూల్ ఆవరణలో వమహాత్మా గాంధీ విగ్రహాలకు ఉపాధ్యాయులు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వాసవి క్లబ్ పాడేరు హిల్స్, వనిత మోదమాంబ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ (మల్టిపుల్) శ్రీనాథ్ శ్రీను, క్లబ్ ప్రెసిడెంట్ పి సంతోష్, ఎస్ మణి, సెక్రెటరీ పి రమేష్, ఎస్ శ్రావణి, ట్రెజరర్ ఎస్ అప్పారావు, ఎస్ రూపావతి, క్లబ్ నెంబర్ ఎస్ సంతోష్, . ఎవి సత్యారావు, అక్షర స్కూల్, మోదమాంబ స్కూల్‌సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మహాత్ముని చిత్రపటానికి ఎంపిపి అనూషాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు, కార్యక్రమంలో ఎంపిటిసి- 1 లోవ పద్మ, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, ఆర్డబ్ల్యూఎస్ జెఇ స్వర్ణలత, పిఆర్ జెఇ బాలకిషోర్, చింతపల్లి సెక్రటరీ కె.శ్రీనివాస్, కొత్తపాలెం సెక్రటరీ రాజేష్, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు

విఆర్.పురం : మండలంలోని చిన్నమట్టపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మహాత్మా గాంధీ 76వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.నాగేశ్వరరావు గాంధీజీ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.విజయకుమారి, విద్యార్థులు, శానిటేష ఆయాలు, కమ్యూనిటీ వర్కర్లు పాల్గొన్నారు.

కల్వర్టు గోతిలో పడి మూగజీవి మృత్యువాత

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని గ్యాస్‌గొడౌన్ ఎదురుగా జాతీయ రహదారిలో కల్వర్టు నిర్మాణానికి తీసిన గొయ్యిలో మూగజీవి మంగళవారం ఇరుక్కుపోయింది. స్థానికులు గమనించి గొయ్యిలో ఇరుక్కుపోయిన మూగజీవిని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. రెండు గంటలపాటు స్థానికులు మూగజీవిని బయటకు తీసేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయింది. నురగలు కక్కుతూ మూగజీవి మతి చెందింది. జాతీయ రహదారి నిర్మాణదారుల నిర్లక్ష్యంతో గొయ్యిల్లో మూగజీవులు ఇరుక్కుపోయి మృత్యువాత పడుతున్నాయని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. కల్వర్టు నిర్మాణాలు పూర్తయిన గొయ్యిలను కప్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణాలకు తీసిన గొయ్యిలను కప్పించి మూగజీవాల మత్యువాతలను నివారించాలని గిరిజనులు కోరుతున్నారు.

గనుల శాఖ అధికారికి కలెక్టర్ ప్రశంస

నేడు ఉద్యోగ విరమణ చేయనున్న జాన్

ప్రజాశక్తి- పాడేరు,: జిల్లా గనుల శాఖ అధికారి ఎ.జాన్‌ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రశంసించారు. బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను కలెక్టర్ చాంబర్ లో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

1992 ఆగస్టు 5న, మొదటిసారిగా సాంకేతిక సహాయకులుగా అనంతపూర్ జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన ఎ. జాన్, వివిధ పదోన్నతులు పొంది రాయల్టీ ఇన్స్పెక్టర్ గా, సహాయ జియాలజిస్ట్‌గా, సహాయ సంచాలుకులుగా విధులు నిర్వర్తించారు. జిల్లాల విభజనకు ముందు విజయవాడలో సహాయక సంచాలకులుగా పనిచేస్తూ బదిలీ పై జిల్లా గనుల శాఖ అధికారిగా జాయిన్ అయ్యారు. చిత్తశుద్ధితో చేపట్టిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా మంత్రులు, కలెక్టర్ల చేతుల మీదుగా పలుసార్లు ప్రశంసా పత్రాలు పొందారు.



విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టుతో పోలీసు ఉన్నతాధికారులు

పోలీస్ కమాండో పోటీల విజేత ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 14వ అఖిల భారత పోలీస్ కమాండో కాంపిటీషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు విశాఖ నగరంలోని గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఇంటెలిజెన్స్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ మహేష్ దీక్షిత్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు క్రీడాకారుల అంకితభావం, కృషి, పట్టుదలకు వేదికగా నిలిచాయన్నారు. గ్రేహౌండ్స్ అదనపు డిజిపి (ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా మాట్లాడుతూ తాజా పోటీల్లో 16 రాష్ట్రాల జట్లు, ఏడు కేంద్ర పోలీసు సంస్థల జట్లు నుంచి 597 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. నేవిగేషన్, స్కిల్, ప్లానింగ్ అండ్ ప్రెజెంటేషన్, ఫిజికల్, ఫైరింగ్‌లలో వారికి పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ పివి.సునీల్, జార్ఖండ్ ఎడిజిపి పివికె.ప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్ అయ్యర్ పాల్గొన్నారు.

విజేతలు ఇలా..

ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు 300 పాయింట్లకుగాను 267.2 పాయింట్లు సాధించి ఓవరాల్ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో మహారాష్ట్ర (252.9 పాయింట్లు), మూడో స్థానంలో రాజస్థాన్ (248.9 పాయింట్లు) నిలిచాయి. విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టులోని 11 మంది ఆటగాళ్లకు, ఇద్దరు మేనేజర్లకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల నగదు ఇవ్వడంతో పాటు 3 సర్వీస్ ఇంక్రిమెంట్లను వారి సర్వీసులో కలపనున్నట్టు గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డిఐజి ప్రవీణ్ ప్రకటించారు.

నిజమైన ఆదివాసీలకే ఇళ్లు ఇవ్వాలి

ప్రజాశక్తి -మారేడుమిల్లి : పిఎం ఆవాస యోజన స్కీం ద్వారా 11 మండలాల్లో నిజమైన ఆదివాసీ పివిటిజి కొండ రెడ్లకే ఇళ్లు మంజూరు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రంప చోడవరం డివిజన్ ప్రధాన కార్యదర్శి చవలం రాంబాబు దొర మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజనేతరులను వివాహం చేసుకున్న గిరిజన మహిళలు భర్త స్థానంలో తండ్రి పేరుతో ఉపాధి కార్డులు పొందగా, అలాంటి వారికి అధికారులు ఇళ్లు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మారేడుమిల్లి పంచాయతీ మొదటి జాబితాలో మంజూరైన గృహాలు పివిటిజి కొండరెడ్లకు కాకుండా వేరే ఇతర కులాలకు చేసుకున్న మహిళల పేరునా మంజూరు కాబడ్డాయని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాల వారికి కూడా గృహాలు మంజూరు చేశారన్నారు. అటువంటి వారిని వెంటనే గుర్తించి జాబితా నుంచి తొలగించాలని, గ్రామసభలు నిర్వహించి నిజమైన ఆదివాసీలను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.

మతోన్మాదం నశించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మతోన్మాదం నశించినప్పుడే భారతదేశంలో శాంతి, సౌఖ్యం వర్ధిల్లుతాయని ఇస్కఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని మతసామరస్య దినోత్సవంగా జరుపుకోవాలని సమాజానికి సూచిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహనదాస్, విశాఖ కో - ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి పిత గాంధీజీ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న తరుణంలో మనదేశంలో మాత్రం హింస, మతోన్మాదం పెరగడం ఆందోళనకరమన్నారు. గాంధీజీ కలలుగన్న స్వరాజ్యాన్ని స్థాపించే సమరంలో వెలుగు దివ్వెలై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇస్కాఫ్ ప్రతినిధులు సుకుమారన్, ప్రభాకర్, సన్ మూర్తి, మధుమతి, రాం ప్రభు, ఉప్పల అప్పలరాజు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ ఫిల్ వద్దే వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల వ్యతిరేకత
- తాడిని తరలించాలని డిమాండ్
- ఎన్‌జిటి కేసును పరిగణనలోకి తీసుకోకపోవడం న్యాయవిరుద్ధం : లోకనాథం
- నీరు, గాలి, నేల కలుషితం : గనిశెట్టి
- వాయిదా వేయాలి: పంచకర్ల
- అదీప్‌రాజు, అమర్ వైఖరి వెల్లడించాలి: బండారు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

'తాడిలో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దు. రాంకీ ప్రయోజనాల కోసం ప్రజల బతుకులు నాశనం చేయొద్దు. కాలుష్య బాధిత గ్రామాలకు సమాచారమివ్వకుండా నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తాడి ప్రజలకు పరిహారం చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించాలి. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రజల అనారోగ్యాలకు కారణమైన రాంకీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' - అని పారిశ్రామిక వ్యర్థాల శుద్ధి నిల్వ కేంద్రం (ల్యాండ్ ఫిల్) ఏర్పాటుపై మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏకోన్ముఖంగా నినదించారు. ల్యాండ్‌ఫిల్‌ను వ్యతిరేకిస్తూ అక్కడకొచ్చిన ప్రజలంతా చేతులెత్తారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించని ఫార్మా డెవలపర్ రాంకీపై ఎన్‌జిటిలో కేసువుండగా, ల్యాండ్‌ఫిల్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం న్యాయ విరుద్ధమన్నారు. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పరిశ్రమల వ్యర్థాలను తాడి తీసుకొచ్చి, ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా చేయడం సరికాదన్నారు. ఫార్మా కాలుష్యంతో పరిసర ప్రజలు కేన్సర్, ఊపిరితిత్తులు, గర్భస్రావ సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా కాలుష్య బాధ భరించలేక గాజువాక, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. ఐఎఎస్ అధికారులు తాడి, తానాంలో ఒక రాత్రివుంటే రాంకీ అసలు రంగు తెలుస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తాడి ప్రజలకు పరిహారం చెల్లించి, తరలించకుండా ప్రజలను ప్రభుత్వం బాధపెడుతోందన్నారు. నిర్వాసితులకు, అర్హత కలిగిన స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామాల్లో దండోరా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సాగు రైతులకు పరిహారం చెల్లించకుండా భూములు తీసుకున్న ఎపిఐఐసి వాటిని రాంకీ ల్యాండ్‌ఫిల్‌కు కేటాయించడం అన్యాయమన్నారు.


ల్యాండ్ ఫిల్‌ను చేతులెత్తి వ్యతిరేకిస్తున్న ప్రజలు

ల్యాండ్‌ఫిల్‌కు కేటాయించిన 50 ఎకరాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు హానిచేసే ల్యాండ్‌ఫిల్‌ను తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ తాడిని తరలించకుండా ల్యాండ్‌ఫిల్‌పై ఎందుకింత తొందరని నిలదీశారు. కాలుష్య బాధిత గ్రామాలకు సమాచారమివ్వకుండా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ల్యాండ్‌ఫిల్‌తో భూగర్భ జలాలు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని ల్యాండ్‌ఫిల్‌కు ప్రభుత్వమెలా కేటాయిస్తుందని అన్నారు. ఫార్మా కాలుష్యంతో మంచినీరు, నేల, గాలికి ప్రజలు దూరమవుతున్నారని అన్నారు. ల్యాండ్‌ఫిల్‌పై తయారు చేసిన ఇఐఎ నివేదిక వాస్తవ విరుద్ధంగా వుందన్నారు. టిడిపి నాయకులు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ తాడి తరలించడానికి విడుదల చేసిన జిఒ అమలుపై లేని శ్రద్ధ, ల్యాండ్‌ఫిల్‌పై ఎందుకన్నారు. ప్రజాభిప్రాయ సేకరణపై ఎమ్మెల్యే అదీప్‌రాజు, మంత్రి అమర్‌నాథ్ తమ వైఖరులను తెలియజేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలకు, లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలిస్తామని తెలిపారు. ఈ సభలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నాగిరెడ్డి, పరవాడ మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ, నీలబాబు, అట్ట సన్యాసప్పారావు, జెటి.రామారావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు జగన్ ఏం వెలగబెట్టారో చెప్పాలి

టిడిపి మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏం వెలగబెట్టారో చెప్పాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి భీమిలి బీచ్ వరకు ఏ స్థలాన్నైనా కబ్జా చేయకుండా జగన్ వదిలిపెట్టారా అని నిలదీశారు. ఎస్సీ యువకుడిని పొట్టన పెట్టుకున్న వ్యక్తిని పక్కన పెట్టుకుని అంబేద్కర్ విగ్రహం ఎలా ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. తాండవ రిజర్వాయర్‌కు నీరు రాకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 99 శాతం హామీలను అమలు చేసినట్టు జగన్ చెబుతున్నారని, రైల్వే జోన్, ప్రత్యేక హోదా ఏవని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు విషయం ఏమైందన్నారు. జాబ్ కేలండర్, 2 లక్షలా 30 వేల ఉద్యోగాలు ఏవి అని ప్రశ్నించారు. అనకాపల్లి పార్లమెంటు స్థానానికి టిడిపి తరుపున పోటీ చేసేందుకు తన కుమారుడు దరఖాస్తు చేసుకున్నాడని ఈ సందర్భంగా వెల్లడించారు. మాజీ ఎన్నికల అధికారి టిఎన్.శేషన్ వద్ద తన కుమారుడు రెండేళ్ల పాటు శిక్షణ పొందాడని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు గండి బాబ్జీ, పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పిఒకు వినతిపత్రం అందజేస్తున్న రాజ్‌కుమార్

జాతీయ రహదారి నిర్వాసితులకు పరిహారం కోసం వినతి

ప్రజాశక్తి- చింతూరు : జాతీయ రహదారి-30 నిర్మాణం వల్ల నష్టపోతున్న పంట పొలాలకు పరిహారం అందించాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు తుమ్మల ఎంపీటీసీ సభ్యులు వేక రాజ్ కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ గంగానమెట్ట గ్రామంలో ఇద్దరు రైతులకు రెండేళ్లగా డబ్బులు పడలేదని, ఎన్నోసార్లు తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయిందని, తమ దగ్గర లేదని, రంపచోడవరం పంపించామని చెబుతున్నారని పేర్కొన్నారు. బాధిత రైతు వెట్టి సుబ్బయ్య ప్రతి ఏటా వరి పండించుకునే వాడని, ఈ ఏడాది హైవే రోడ్డు నిర్మాణం జరుగుతుందని ఏ పంట వేయలేదని, కాని ఇటు పరిహారం, అటు పంట రెండు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోయిన భూమికి పరిహారం అందజేయాలని కోరారు. దీనికి పిఒ స్పందిస్తూ ఈ విషయాన్ని అధికారులతో చర్చించి పరిష్కారమయ్యేలా చూస్తారని హామీ ఇచ్చారు.

ఏజెన్సీ ప్రాంత మాదిగలను వాల్మీకిలుగా గుర్తించాలని ధర్నా

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంత మాదిగలను వాల్మీకిలుగా గుర్తించాలని కోరుతూ ఇంటిలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటిడిఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం రంపచోడవరం సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి మానవహారం చేపట్టారు. తరువాత అక్కడ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఇంటర్నేషనల్ అధ్యక్షులు గెడ్డం బాపిరాజు మాట్లాడుతూ ఏజెన్సీలో మాదిగలు అంటరానితనంలోనే ఉన్నారని, ప్రాథమిక హక్కులు కూడా లేకుండా జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే అవసరమైతే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మాదిగలంతా ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వేమగిరి ముసిలి బాబు, వివిధ మండలాల నుండి ఏజెన్సీ ప్రాంత మాదిగలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు వెంటనే చెల్లించాలి : సిపిఎం

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ఉపాధి హామీ పనుల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సాగర పంచాయతీ అడపవలసలో సిపిఎం పంచాయతీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ డిసెంబర్, జనవరి నెలల్లో కాఫీ తోటల చుట్టూ రాతి కట్టడాలు పనులను రెండు నుంచి నాలుగు వారాలు చేసిన కూలీలకు ఇప్పటికీ వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారన్నారు.

బిల్లులు అందక ఉపాధి కూలీలు సంక్రాంతి పండగ కూడా చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. తక్షణమే ఉపాధి కూలీలకు బకాయి ఉన్న నిధులను వారి వ్యక్తిగత ఖాతాలో జమచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో టి పూర్ణిమ్మ,, టి నూకరాజు, కె బలరాం, టి పాపారావు, చెడ్డ రఘు, కె రాజేష్ బి నూకరాజు, వి సంతోష్, చెడ్డ రామూర్తి. పాల్గొన్నారు.